## క్లుప్తంగా

### ఎన్నారై పేరెంట్స్‌కు వైద్య శిబిరం



వైద్య శిబిరంలో పాల్గొన్న అసోసియేషన్ ప్రతినిధులు

కాకినాడ సిటీ: ఎన్ఆర్ఐ పేరెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కాకినాడ వివేకానంద పార్కు సమీపంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్లు ఎన్.నగేష్‌బాబు, ఎన్.రాఘవ ఆధ్వర్యంలో ఎన్నారై పేరెంట్స్‌కు మెడికల్ క్యాంపును నిర్వహించారు. అసోసియేషన్ కార్యదర్శి సీఎస్ శర్మ, కోశాధికారి సీవీ రామనాథం, వైస్ ప్రెసిడెంట్ వైడీ రామారావు మాట్లాడుతూ ఉద్యోగ రీత్యా విదేశాల్లో స్థిరపడి ఉన్న వారి తల్లిదండ్రులకు భరోసాగా రెండేళ్ల క్రితం ఎన్నారై పేరెంట్స్ అసోసియేషన్ కాకినాడలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అసోసియేషన్ ద్వారా ఎన్నారైల తల్లిదండ్రులకు కార్పొరేట్ స్థాయి చికిత్సలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఐ పేరెంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు సుబ్రమ్మణ్యంను, సభ్యులను దుశ్శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు కావ్య, లోకేష్, అహ్మద్, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

### ఎన్నికలు దిగ్విజయంగా పూర్తిచేశాం

సిబ్బందిని అభినందించిన ఎస్ఐ రామకృష్ణ



కరప పోలీసుస్టేషన్ ఆవరణలో సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్ఐ రామకృష్ణ

కరప: రాజకీయ పార్టీలను, ప్రజలను సమన్వయం చేసుకుంటూ సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా ముగించామని, సహకరించిన స్టేషన్ సిబ్బందికి, మండల ప్రజలకు కరప ఎస్ఐ టి.రామకృష్ణ ధన్యవాదాలు తెలిపారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో ఆదివారం సిబ్బందితో సమావేశమై ఆయన మాట్లాడారు. ఎన్నికల ప్రచారం నుంచి కౌంటింగ్‌రోజు వరకూ సిబ్బంది వ్యహరించిన తీరును ఆయన ప్రశంసించారు. మూడు ఎన్నికల నుంచి వివిధ పోలీసుస్టేషన్లలో పనిచేసినా, 2024 ఎన్నికలంత ప్రశాంతంగా ఎక్కడా జరగలేదన్నారు. ఇందుకు సీఐ కె.శ్రీనివాస్, ఇతర అధికారులు, ఏఎస్ఐలు వి.సూరిబాబు, జి.ప్రసన్నకుమార్, స్టేషన్ సిబ్బంది అందించిన సహకారానికి ఎస్ఐ రామకృష్ణ కృతజ్ఞతలు తెలియజేశారు.

### మహిళలకు చీరల పంపిణీ



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న సంస్థ చైర్మన్ లక్ష్మీదుర్గ

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో కె.లక్ష్మీదుర్గ నూతనంగా ఏర్పాటు చేసిన 'మీ కోసం రత్నశ్రీ సేవా సంస్థ' ఆధ్వర్యంలో ఆదివారం మహిళలకు చీరలు ఉచితంగా పంపిణీ చేశారు. రమణయ్యపేటలో మాజీ సర్పంచ్ అడబాల రత్నప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వైద్యులు బొండా సూర్యారావు, రమాదేవి ముఖ్య అతిథులుగా పాల్గొని మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాగేశ్వరరావు, రాజు, గణపతి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

### నాన్న ఒక రక్షణ కవచం

కాకినాడ రూరల్: కుటుంబానికి రక్షణ కవచంగా నాన్న నిలుస్తాడని, బాధ్యతలను మోస్తూ ఎన్నో త్యాగాలు చేసే నాన్నను వృద్ధాప్యంలో ప్రతి ఒక్కరూ కంటికి రెప్పలా కాపాడుకోవాలని లయన్ ఇందుగుల ప్రసాద్ నాయుడు పేర్కొన్నారు. ప్రపంచ పితృ దినోత్సవం సందర్భంగా రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పిల్లలకు అమ్మ తొలి అడుగు వేయిస్తే నాన్న ప్రగతిని చూపుతాడన్నారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

### వేళంగిలో ఉచిత వైద్య శిబిరం

కరప: మండలం వేళంగిలోని ప్రాథమిక పాఠశాలలో ఆదివారం కాకినాడ బృందావనం ఆస్పత్రి యాజమాన్యం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. వేళంగి పరిసర గ్రామాల నుంచి 500 మంది రోగులు శిబిరానికి రాగా డాక్టర్ బిక్కిన శ్రీనివాస్, డాక్టర్ చంద్రు కృష్ణప్రసాద్ వైద్యపరీక్షలు నిర్వహించి, అవసరమైనవారికి ఉచితంగా మందులు అందజేశారు. మాజీ సర్పంచ్ ముత్యాల శ్రీనుబాబు, చంద్రు హరిబాబు, వెలుగుల లచ్చారావు, పి.సత్యప్రసాదరావు, పాతూరి వీర్రాజు తదితర గ్రామస్తులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# భైరవం.. భీకరం..

- బెంబేలెత్తిస్తున్న వీధి కుక్కలు
- సంతతి నియంత్రణ చర్యల్లో అధికారులు విఫలం
- నిత్యం గాయాల పాలవుతున్న పాదచారులు, వాహన చోదకులు



జగన్నాథపురం వంతెన వద్ద రోడ్డుకు అడ్డంగా కుక్కల మార్చ్‌ఫాస్ట్

కాకినాడ సిటీ: కాకినాడ సిటీ, రూరల్ నియోజకవర్గాల్లో కుక్కల బెడద తీవ్రంగా ఉంది. కాస్త జనసంచారం తగ్గాక పాదచారులు, వాహన చోదకులను వెంబడిస్తూ గాయాలపాలు చేస్తున్నాయి. ఇటీవల కుక్కలు రెండు రోజుల్లోనే దాదాపుగా 16 మందిని గాయపరచడం ఆందోళన కలిగించే విషయం. ప్రభుత్వ వైద్యశాలలకు నిత్యం ఐదు నుంచి 8 మంది వరకు కుక్క కాటు కేసులు వస్తున్నారని ఆయా పీహెచ్‌సీల వైద్యాధికారులు చెబుతున్నారు. కాకినాడ రూరల్ తూరంగి, కొవ్వూరు, కొవ్వాడ, వాకలపూడి, వలసపాకల, రమణయ్యపేట, రాయుడుపాలెం, పండూరు, నేమాం, కరప, వేళంగి, యండమూరు, పెద్దాపురప్పాడు, గొర్రిపూడి తదితర గ్రామాల్లో, కాకినాడ సిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లోను కుక్కలు విచ్చలవిడిగా తిరుగుతూ దారిన పోయేవారిపై, చిన్నపిల్లలపై దాడులు చేసి గాయపరుస్తున్నాయి. కుక్కల నియంత్రణతో పాటు, వాటి సంతాన నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

**పశువులపైనా దాడి**

గ్రామాల్లో స్వైరవిహారం చేస్తున్న కుక్కలు పశువులపైనా దాడి చేస్తున్నాయి. గేదెలు, కోళ్లు, పావురాలు, పంది పిల్లలు పెంపుడు జంతువులపై కుక్కలు తమ ప్రతాపాన్ని చూపిస్తున్నాయని, మండల, గ్రామాల్లోని ఉన్నతాధికారులు స్పందించి కుక్కల సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

**నియంత్రణ కరువు**

- యానిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) అంటే జంతువుల కుటుంబ నియంత్రణ చేపట్టడం లేదు.
- ఏబీసీ ఏజెన్సీని నియమించి వీధికుక్కలు, కోతులు, ఇతర జంతువుల నుంచి మనుషులకు హాని కలుగకుండా నియంత్రణ చర్యలు శూన్యం.
- జంతువులకు కుటుంబ నియంత్రణ చేసే ఏజెన్సీ ఎక్కడా లేదన్న విమర్శలున్నాయి.
- పశువులకు ముందస్తుగా రేబిస్ వ్యాక్సిన్ వేయించాలి.

హోటళ్లు, హాస్టళ్లు, ఫంక్షన్లలో మిగిలిన ఆహారాన్ని ఎక్కడ పడితే అక్కడ వేస్తే కుక్కల సంచారం పెరుగుతుంది. అలా పడేయకపోవడం మంచిది.

**దాడులు చేస్తున్నాయి**



గ్రామాల్లో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తూ దాడులు చేస్తున్నాయి. దీంతో బయటకు వెళ్లాలంటేనే భయం వేస్తోంది. చిన్నపిల్లలను బయటకు పంపడానికి భయమేస్తోంది. గుంపులు, గుంపులుగా తిరుగుతూ ప్రజలు, పశువులపై దాడులు చేస్తున్నాయి. వీధి కుక్కలు దాడులు చేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో కుక్కల సంఖ్య పెరిగిపోతుండడంతో ప్రజలు భయటకు వెళ్లాలంటే భయపడిపోతున్నారు.

– డీఎస్‌వీ ప్రసాద్, రమణయ్యపేట



గుంపులుగా తిరుగుతున్న కుక్కలు

## శ్రీశ్రీ స్ఫూర్తి కొనసాగుతూనే ఉంది



సదస్సులో మాట్లాడుతున్న ప్రభాకరవర్మ

కాకినాడ సిటీ: కవిత్వాన్ని ప్రజాస్వామీకరించడం, కష్టజీవుల పక్షాన నిలబడడం శ్రీ శ్రీ వల్లనే సాధ్యం అయ్యిందని అద్దేపల్లి ప్రభు కొనియాడారు. శనివారం రాత్రి కాకినాడ యూటీఎఫ్ హోంలో శ్రీశ్రీ 41వ వర్ధంతి సందర్భంగా 'శ్రీశ్రీ ని స్మరించుకుందాం' అనే కార్యక్రమం నిర్వహించారు. యూటీఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి జి ప్రభాకరవర్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీశ్రీ – నేడు అనే అంశంపై అద్దేపల్లి ప్రభు మాట్లాడారు. సాధారణ ప్రజలు కూడా శ్రీశ్రీ కవితలు చదివి స్ఫూర్తి పొందుతారన్నారు. కవిత్వాన్ని ప్రజాస్వామీకరించడంలో కష్టజీవుల పక్షాన నిలబడడంలో శ్రీశ్రీకి మరొకరు సాటి రారన్నారు. రాజకీయ చైతన్యం, మార్క్సిజంతో కొనసాగడం శ్రీశ్రీ ప్రత్యేకతగా గుర్తించాలన్నారు. ప్రభాకరవర్మ మాట్లాడుతూ ఆకాశంలో విహరిస్తున్న సాహిత్యాన్ని భూమార్గం పట్టించిన ఘనత శ్రీశ్రీకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జేవీవీ జిల్లా అధ్యక్షుడు కేఎంఎంఆర్ ప్రసాద్, పెన్షనర్ల సంఘం నాయకులు కె.సత్తిరాజు, ఆవాజ్ కన్వీనర్ ఇబ్రహీం, పలివెల వీరబాబు తదితరులు శ్రీశ్రీ కవితలు చదివి వినిపించారు. అంతకు ముందు వారు శ్రీశ్రీ చిత్రపటానికి నివాళులర్పించారు.

# సృజన పరీక్షించేలా చెకుముకి ప్రశ్నావళి



చెకుముకి ప్రశ్నల నిధి వర్క్ షాపులో మాట్లాడుతున్న రామచంద్రయ్య

కాకినాడ సిటీ: కచ్చితత్వం, శాస్త్రీయత, శాస్త్రీయ దృక్పథం జనవిజ్ఞాన వేదిక ప్రతిష్టాత్మకంగా నిర్వహించే చెకుముకి ప్రశ్నల్లో ప్రతిఫలించాలని నిట్ వరంగల్ విశ్రాంత ప్రొఫెసర్ ఎం.రామచంద్రయ్య అన్నారు. ఆదివారం నుంచి రెండు రోజుల పాటు కాకినాడ ఐడియల్ కళాశాలలో నిర్వహిస్తున్న చెకుముకి ప్రశ్నల నిధి వర్క్‌షాపులో ఆయన పాల్గొని మాట్లాడారు. నేటి మన విద్యా వ్యవస్థ ప్రధానంగా విద్యార్థుల్లో ధారణాశక్తిని పరీక్షించేలా ఉందన్నారు. దానికి భిన్నంగా చెకుముకి ప్రశ్నల్లో విద్యార్థుల అవగాహనను, నిత్యజీవిత వినియోగం, సృజనాత్మకతను పరీక్షించేలా అంశాలు ఉండాలన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న సమన్వయకర్త, ఉమ్మడి ఏపీ పూర్వ ప్రధాన కార్యదర్శి సి.మోహన్ మాట్లాడుతూ చెకుముకి సైన్స్ సంబరాలను సాధారణంగా నిర్వహించే టాలెంట్ టెస్ట్‌లకు భిన్నంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ చెకుముకి పరీక్షను మరింత శాస్త్రీయంగా, వినూత్నంగా నిర్వహించేందుకు, ప్రశ్నలను తయారు చేయడానికి ఈ వర్క్‌షాపు నిర్వహిస్తున్నామని వివరించారు. యూటీఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి జి.ప్రభాకరవర్మ మాట్లాడుతూ శాస్త్రీయ దృక్పథ ప్రచారం విస్తృతం కావడానికి, చెకుముకి ప్రతిష్ట మరింత ఇనుమడించడానికి ఈ వర్క్‌షాపు ఎంతగానో తోడ్పడుతుందన్నారు. అనంతరం వివిధ జిల్లాల నుంచి విచ్చేసిన రిసోర్స్‌పర్సన్లు సాంఘిక, భౌతిక, జీవ, గణితశాస్త్రాల్లో, శాస్త్ర సాంకేతికత అనే విభాగాలుగా విడివడి పాత ప్రశ్నాపత్రాలను విశ్లేషించి ప్రశ్నలను తయారు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర పాట్రన్ చల్లా రవి కుమార్, రాష్ట్ర కమిటీ సభ్యులు కన్వీనర్ కేవీవీ సత్యనారాయణ, రాష్ట్ర చెకుముకి కన్వీనర్ కేఎంఆర్ఆర్ ప్రసాద్, కన్వీనర్ జి.గిరిధర్, సభ్యులు మేకా సుబ్బారావు, వి.రామారావు, వివిధ జిల్లాల నుంచి వచ్చిన రిసోర్స్ పర్సన్లు, జిల్లా కమిటీ సభ్యులు యా. సత్యనారాయణరెడ్డి, బీవీవీ సత్యనారాయణ, సీహెచ్ రాజ ఉమామంగతాయారు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలి



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

కాకినాడ సిటీ: రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని, కార్మిక, ఉద్యోగ వర్గాలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని ఐఎఫ్‌టీయూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సర్వసభ్య సమావేశం నూతన రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఆదివారం కాకినాడ పర్లోవపేట మహాత్మజ్యోతి బాపూలే కాలనీలో నిర్వహించి సర్వసభ్య సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.వెంకటేశ్వర్లు మాట్లాడారు. కూటమి నాయకులు ప్రజల సంక్షేమం, వాస్తవిక జీవన ప్రమాణాల అభివృద్ధిపై ఇచ్చిన హామీల ఫలితంగా అసాధారణ విజయాన్ని సాధించిందన్నారు. ఈ విజయానికి కారణమైన ప్రజల ఆశల్ని నెరవేర్చాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందన్నారు. 2019 ముందు అధికారంలో ఉన్న చంద్రబాబు ప్రభుత్వం రాష్ట్ర ప్రజల ఆశల్ని వమ్ము చేసిందన్నారు. వాటిని నెరవేర్చలేకపోవడంతో ప్రజా విశ్వాసాన్ని కోల్పోయి 2019 ఎన్నికల్లో ఓటమి పాలయ్యారన్నారు. కార్మిక వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న బాధ్యతాయుత సంస్థగా ప్రజల పక్షపాతిగా ఐఎఫ్‌టియు స్పందిస్తుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు జి.రాజ్ కుమార్, కె.నరసింహ, బాబి, వరహాలురావు, నాయుడు, ప్రసాద్, బుజ్జి, వీరబాబు, శ్రీను తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

## శుభ్రం చేయకపోగా చేపల వేట కూడానా!

- ఫిల్టర్ చెరువు పరిస్థితిపై పట్టణ ప్రజల ఆగ్రహం
- గోదారి నీరూ పాడయ్యే అవకాశం



సామర్లకోట ఫిల్టరు చెరువులో చేపల వేట

సామర్లకోట: పట్టణ ప్రజలకు తాగునీరు సరఫరా చేసే చెరువులో నీరు నాచు రంగులో ఉండటంతో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందడం లేదు. ఆ ఆందోళనలో ప్రజలుంటే చెరువులో చేపల వేట ప్రారంభించడంతో పట్టణ ప్రజలు ఆశ్చర్యపోతున్నారు. ఏటా సముద్ర వేట నిషేధ సమయంలో అధికారుల అనుమతితో ఫిల్టర్ చెరువులో చేపలవేట సాగిస్తుంటారు. గతంలో చెరువులో చేపల వేట జరిగే సమయంలో వెనుక భాగంలోనే బోట్లను నిలిపి చేపలు వేటాడేవారు. అయితే ప్రస్తుతం మున్సిపాలిటీ ఫిల్టర్ ప్లాంటుకు నీరు వెళ్లే వైపు వరకు బోట్లతో చేపల వేట సాగించడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. చెరువులో నీరు ఆకుపచ్చ రంగులో ఉన్న సమయంలో చేపల వేట సాగిస్తే నీరు మరింత కలుషితం అవుతుందని పట్టణ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గోదావరి కాలువకు నీరు రావడంతో మున్సిపల్ అధికారులు ఆ నీటిని నేరుగా ఫిల్టరు చెరువుకు మళ్లించే ఏర్పాట్లు చేస్తున్నారు. దీనిపై వివరణ కొరడానికి ప్రయత్నం చేయగా మున్సిపల్ కమిషనర్ జె.రామారావు అందుబాటులో లేరు.

## వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు



గణేష్‌కు చికిత్స చేస్తున్న వైద్యుడు

కరప: మండలం నడకుదురు సమీపంలోని ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద కారు ఢీకొట్టిన సంఘటనలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు కరప గ్రామానికి చెందిన పోలిశెట్టి గణేష్ ఆదివారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై కాకినాడ వెళ్తుండగా నడకుదురు, తూరంగి గ్రామాల మధ్య ఉండే ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్దకు వెళ్లేసరికి ఉప్పలంక వైపు నుంచి ఇంద్రపాలెం వైపు వెళ్లే కారు బలంగా ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో గణేష్‌కు చేతులపైన, కాళ్లపైన, తలవెనుక భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. ఘటనా స్థలంలో ఉన్న నలుగురు యువకులు స్పందించి క్షతగాత్రుని ఫోన్ నుంచే బంధువులకు సమాచారం అందించి, కరప తీసుకొచ్చి అప్పగించారు. కరపలో క్షతగాత్రునికి ప్రథమ చికిత్స చేయించి, మెరుగైన వైద్యం కోసం బంధువులు కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు.

## వృక్షం పునర్జన్మకు ఆల్ ఈజ్ వెల్ కృషి



సూర్యారావుపేటలో కూలిన చెట్టు



జంతుహింస నివారణ సంఘంలో చెట్టును పాతిపెట్టిన ఆల్ ఈజ్ వెల్ సభ్యులు

బోట్‌క్లబ్: సుమారు 40 ఏళ్ల నాటి వృక్షం నాలుగు రోజుల క్రితం రోడ్డుకు అడ్డంగా కూలిపోయింది. రోజూ ఆ మార్గం మీదుగా వెళ్తూ ఆ చెట్టును చూసేవారు వారికి తెలియకుండానే దానిపై ప్రేమ పెంచుకున్నారు. ప్రస్తుతం ఆ చెట్టు కూలిపోవడంతో వారు మనోవేదన వ్యక్తంచేస్తున్నారే తప్ప ఏమీ చెయ్యలేని పరిస్థితి. ఈ విషయం తెలుసుకున్న ఆల్ ఈజ్ వెల్ సంస్థ సభ్యులు ఆ చెట్టును తిరిగి బతికించేందుకు కృషి చేస్తున్నారు. సూర్యారావుపేటలో పడిపోయిన ఆ చెట్టును వారు అక్కడి నుంచి తరలించి నాగమల్లితోట సమీపంలో ఉన్న జంతు హింస నివారణ కేంద్రంలో పాతిపెట్టి చిగురింపజేసేందుకు కృషి చేస్తున్నారు. ఈ ప్రయత్నం విజయవంతమైతే పడిపోతున్న మరిన్ని మొక్కలను రీ ప్లాంటేషన్ చేయడానికి ఆ సంస్థ సభ్యులు కిషోర్, అతని బృందం సిద్ధంగా ఉన్నారు.

## గంజాయి మత్తులో యువత చిత్తు

కొత్తపల్లి: గంజాయి మత్తులో యువత జీవితాలు చిత్తవుతున్నాయి. కళాశాలలకు వెళ్లాల్సిన విద్యార్థులు బ్యాగ్‌లతో నిర్జన ప్రదేశాలకు వెళ్లి గంజాయి గుప్పుగుప్పుమనిపిస్తున్నారు. గంజాయిని ఒక్కో ప్రాంతంలో షార్ట్ కట్‌లో ఒక్కో పేరుతో పిలుస్తూ పక్క వారికి తెలియకుండా జాగ్రత్త పడుతున్నారు. ముఖ్యంగా ఉప్పాడ బీచ్ రోడ్డు, నాగులపల్లి, వాకతిప్ప, కొత్తమూలపేటలో పలు పుంత రోడ్డులో, ఖాళీగా ఉన్న ప్రభుత్వ కార్యాలయాలకు యువత చేరుతున్నారు. నలుగురు యువకులు ఒక చోటకు చేరి గంజాయి గుప్పుమనిపిస్తుంటే మరికొందరు ద్రవ రూపంలో ఉన్న మత్తు పదార్థాన్ని ప్లాస్టిక్ సోడా బాటిళ్లలో నింపి గొట్టం ద్వారా పీల్చి ఆనందిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గంజాయి సరఫరా చేస్తున్న వారిపై నిఘా ఏర్పాటు చేసి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై ఎస్సై స్వామినాయుడును వివరణ కోరగా గంజాయి విక్రయాలు చేసినా, కాలినా కఠిన చర్యలు తీసుకుంటామని, దీనిపై ప్రత్యేక దృష్టి పెడతామని పేర్కొన్నారు.

## కార్మికులను తొలగించడం తగదు



రాక్ సిరామిక్స్ గేటు వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు

సామర్లకోట: ప్రైవేటు పరిశ్రమలు కార్మికులను తొలగించే కార్యక్రమాన్ని మానుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి క్రాంతికుమార్ అన్నారు. ఆదివారం ఏడీబీ రోడ్డులోని రాక్ సిరామిక్స్‌లో తొలగించిన కార్మికులు ఫ్యాక్టరీ వద్ద ఆందోళన నిర్వహించారు. క్రాంతికుమార్ మాట్లాడుతూ గత ఏడు రోజులుగా గేటు వద్ద కార్మికులు ఆందోళన చేస్తూ ఉంటే కొంత మంది కార్మికులను ఫ్యాక్టరీ అధికారులు పిలిచి సమస్యలపై చర్చించకుండా పోలీసులతో లాఠీచార్జి చేయిస్తామని వారిని బెదిరించడం దారుణమన్నారు. ఇటువంటి హెచ్చరికలు మానుకోక పోతే తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందన్నారు. ఫ్యాక్టరీ నుంచి తొలగించిన కార్మికులను విధులలోనికి చేర్చుకుని సమస్యను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్మికులు చంద్రశేఖర్, సతీష్, రామకృష్ణ, వరప్రసాద్, మల్లికార్జునరావు, గంగాధర్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

# మృగశిరాన ఉష్ణతాపం

- రోహిణీ కార్తెను మించి ఎండల తీవ్రత
- బయటకు వెళ్లే సాహసం చేయలేని పరిస్థితి
- ఉదయం తొమ్మిది నుంచే వేడి గాలులు

కరప: మృగశిర కార్తెలో ప్రచండ భానుడు చెలరేగిపోతున్నాడు. సహజంగా మృగశిర ఎండలు ఉడికించేస్తాయంటారు. అంతకు మించి ఉన్న ఉష్ణతాపాన్ని భరించలేక గ్రామాల్లో ప్రజలు అల్లాడుతున్నారు. ఆదివారం నాటి ఎండ 41 డిగ్రీలు నమోదు కావడంతో పిల్లా పెద్దా అంతా బేజారెత్తిపోయారు. మృగశిరకార్తె వచ్చి వారం రోజులైనా ఎండల తీవ్రత తగ్గకపోవడంతో ప్రజలు ఉక్కిరి, బిక్కిరవుతున్నారు. ఒకపక్క కాలువలకు నీరొదిలారని, నైరుతి రుతుపవనాలు కూడా వచ్చేశాయని ప్రజలు సంతోషపడ్డారు. ఆ సంతోషం ఎంతో సేపు లేకుండా రెండు రోజులుగా ఎండలు, ఉక్కపోత, వడగాడ్పులతో భయపడిపోతున్నారు. ఉదయం 9 గంటల నుంచే వేడిగాలులు వీస్తున్నాయని వాటిని తట్టుకోలేకపోతున్నామని వృద్ధులు ఆవేదన చెందుతున్నారు. మధ్యాహ్నం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. కాలువల్లో స్నానంచేస్తూ వేసవి తాపం నుంచి ఉపశమనం పొందుతున్నారు. నైరుతిరుతుపవనాలు పూర్తిస్థాయిలో రావాలని ప్రజలు భగవంతున్ని ప్రార్థిస్తున్నారు.



కరపలో నిర్మానుష్యంగా ఉన్న కాకినాడ వెళ్లే రోడ్డు



కర్ఫ్యూను తలపిస్తున్న కరప-రామచంద్రపురం రహదారి



జనసంచారం లేని కరప-అరట్లకట్ట రోడ్డు



వేసవితాపం తీర్చుకోవడానికి కాలువలో జలకాలాడుతున్న చిన్నారులు

## వానా వానా వల్లప్పా..



కాకినాడ రూరల్‌లో ఆదివారం సాయంత్రం కురుస్తున్న వర్షం

కాకినాడ రూరల్: కాకినాడ రూరల్‌లో ఆదివారం సాయంత్రం కుండపోత వర్షం పడింది. ఆకాశం ఒక్కసారిగా మేఘావృతమై ఉరుములు, మెరుపులతో పాటు వడగండ్ల వాన పడింది. ఆకాశం ఈనిందా అన్నట్టుగా సుమారు గంట పాటు పడిన వర్షంతో జనాలు ఎక్కడి వారు అక్కడే నిలిచిపోయారు. పల్లపు ప్రాంతాలు, రోడ్లపై నీరు నిలిచిపోయింది. ఏరువాక పౌర్ణమి సమీపిస్తున్న తరుణంగా వాతావరణం చల్లగా మారి వర్షం పడడంతో రైతులు వ్యవసాయ పనులు ప్రారంభించుకునేందుకు వీలవుతుందని చెబుతున్నారు.